సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 3 । మే । 2025



ఆక్వా సాగులో అప్రమత్తం

ఉష్ణోగ్రతల పెరుగుదల ఆక్వా సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ముందస్తు జాగ్రత్తలు పాటించాలని మత్స్యశాఖ నిపుణులు సూచిస్తున్నారు. 10లో ▸



కొల్లేరు అందాలు కనుమరుగు

ఒకనాటి కొల్లేరు అందాలు నేడు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. మానవ తప్పిదం కారణంగా కొల్లేరు అందాలు కనుమరుగవుతున్నాయి. 10లో ▸



విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం

రాష్ట్రవ్యాప్తంగా శాఖలుగా విస్తరించిన ఓ ప్రైవేట్ విద్యాసంస్థ ఏలూరు పరిసర ప్రాంతాల విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతోంది. 10లో ▸

అన్నదాతల్లో అలజడి



వాతావరణానికి జడిసి హడావుడిగా ధాన్యం పట్టుబడి చేస్తున్న రైతులు

వాతావరణ గుబులు

- జిల్లాలో ముమ్మరంగా మాసూళ్లు
- మబ్బులు, వర్షాలతో బెంబేలు
- పంట ఒబ్బిడికి రైతుల పాట్లు
- గోనె సంచుల కొరత
- ధాన్యం సేకరణ లక్ష్యాన్ని కుదించిన ప్రభుత్వం
- అయినకాడికి దోచుకునే పనిలో దళారులు

2.20 లక్షల ఎకరాల్లో..

జిల్లాలోని 2.20 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. పంట తుది దశకు చేరగా మాసూళ్లను ముమ్మరం చేశారు. శుక్రవారం నాటికి 1.2 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు, ఆకివీడు తదితర మండలాల్లో చాలా వరకు కోతలు జరగ్గా, వీరవాసరం, పాలకోడేరు, అత్తిలి, ఇరగవరం, ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు తదితర మండలాల్లో ముమ్మరమయ్యాయి. ఈనెల 20 నాటికి పనులు దాదాపు పూర్తవుతాయని వ్యవసాయ అధికారులు అంటున్నారు.

సాక్షి, భీమవరం: రబీ ధాన్యం చేతికొస్తున్న సమయంలో వాతావరణ మార్పులు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంటను గట్టెక్కించేందుకు ఉరుకులు పరుగులు పెడుతుంటే.. ధాన్యం సేకరణ లక్ష్యాన్ని ప్రభుత్వం తగ్గించేయడం, ప్రతికూల వాతావరణం, రైతుల భయాన్ని ఆసరాగా చేసుకుని దళారులు దోపిడీకి తెరలేపే పనిలో ఉన్నారు.

తగ్గించిన లక్ష్యం

రబీ సీజన్‌లో 9.25 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. 7.9 లక్షల టన్నులు సేకరించాల్సి ఉండగా ప్రభుత్వం 6 లక్షల టన్నులు మాత్రమే లక్ష్యంగా నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలోని దాదాపు 206 రైస్ మిల్లులకు అధికారులు సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) కేటాయింపులు చేశారు. ఇప్పటివరకూ 263 రైతు సేవా కేంద్రాల ద్వారా 3.40 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించారు. దీంతో మిగిలిన ధాన్యాన్ని రైతులు బయటి మార్కెట్‌లో దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి. బస్తాకు రూ.1,725 మద్దతు ధర కాగా దళారులు రూ.200 నుంచి రూ.300 వరకు తగ్గించి కొంటున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఉరుకులు.. పరుగులు

రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై గాలులు వీయడం, జల్లులు పడుతుండటంతో రైతులు పంటను కాపాడుకునేందుకు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. తేమ శాతం పేరిట దళారులు, మిల్లర్లు బస్తాకు రూ.200 నుంచి రూ.300 వరకు కోత పెట్టడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వ సేకరణ లక్ష్యం తగ్గించడం, ప్రతికూల వాతావరణం దళారుల దోపిడీకి మార్గం సుగమం చేస్తున్నాయి. జిల్లాలో మరో 1.25 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు కృషి చేస్తున్నట్టు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

గోనె సంచులకు కొరత

జిల్లాలో 1.14 కోట్ల గోనె సంచులను రైతులకు అందించామని, ఇప్పటివరకు 75 లక్షల సంచులు వినియోగించుకోగా, ఇంకా 39 లక్షలు అందుబాటులో ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. వారం రోజులకు అవసరమైన సంచులను ముందుగానే సిద్ధం చేస్తున్నట్టు చెబుతుండగా.. క్షేత్రస్థాయిలో మాత్రం పలు గ్రామాల్లో సంచులు ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. ధాన్యం ఆరిపోయినా సంచులు లేక రోజుల తరబడి రోడ్డు పక్కల రాశులు పోసి ఉంచాల్సి వస్తోందని అంటున్నారు. వచ్చిన సంచులు చాలా వరకు పాడైపోయి ఉంటున్నాయని చెబుతున్నారు. మరో పక్క కమీషన్‌దారులు చెప్పిన వారికే సంచులు అందజేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వారం నుంచి తిరుగుతున్నా..



నేను 11 ఎకరాలు సాగు చేశాను. ధాన్యం ఆరబోసుకుని వారం కావస్తోంది. అప్పటి నుంచి సంచుల కోసం తిరుగుతుంటే ఈ రోజు ఇచ్చారు. 900 సంచులు అవసరమైతే 500 ఇచ్చి మిగిలినవి తర్వాత ఇస్తామన్నారు.

– జి.సత్యనారాయణ, కౌలు రైతు, బ్రాహ్మణచెరువు

సంచులు లేవంటున్నారు



1.2 ఎకరాల్లో వారం కితం కోత కోసి ధాన్యం ఆరబెట్టాను. వాతావరణం చూస్తే ఎప్పుడెలా ఉంటుందో తెలియడం లేదు. పట్టుబడి చేద్దామంటే సంచులు లేవని, రావాలని చెబుతున్నారు. చాలా ఇబ్బంది పడుతున్నా.

– కె.రంగారెడ్డి, రైతు, వెలగలవారిపాలెం

మొగల్తూరు మామిడి..
తడబడి

- ఏటా తగ్గుతున్న విస్తీర్ణం
- తెగుళ్ల బారిన తోటలు



మొగల్తూరులో మామిడి మార్కెట్

నరసాపురం: మొగల్తూరు మామిడి ప్రాభవం కోల్పోతుంది. ఏటేటా తీర ప్రాంతంలో మామిడి తోటల విస్తీర్ణం తగ్గుతోంది. పట్టణీకరణతో తోటలు నరికివేయడం, తెగుళ్ల కారణాలుగా ఉన్నాయి. ప్రస్తుతం మొగల్తూరు, పేరుపాలెం పరిసర ప్రాంతాల్లో సుమారు 1,800 ఎకరాల్లో మాత్రమే తోటలు ఉన్నాయి. చెరుకు రసం, చిన్న రసాలు, పెద్ద రసాలు, కొత్తపల్లి కొబ్బరి రకాలు ప్రత్యేకం. ముఖ్యంగా మొగల్తూరు బంగినపల్లికి మంచి పేరుంది. సువర్ణరేఖ, కలెక్టర్, హైజర్లు రకాలు పచ్చళ్లకు ప్రసిద్ధి. జిల్లాతో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చి ఈ రకాలను కొనుగోలు చేస్తుంటారు.

తెగుళ్లతో సతమతం

మామిడి చెట్లకు మచ్చతెగులు, మంచు తెగుళ్లు సోకుతున్నాయి. రియల్ ఎస్టేట్ పెరగడంతో తోటలు నరికివేస్తున్నారు. దీంతో ఒకప్పుడు 5 వేల ఎకరాల్లో ఉన్న తోటలు నేడు 1,800 ఎకరాలకు పరిమితమయ్యాయి. అలాగే ఈ ప్రాంతంలో ఇంటి పెరట్లలోనూ మామిడి చెట్లు ఉన్నాయి. ఏటా గాలి దుమారంతో పిందెలు, కాయలు రాలిపోవడంతో కాపు తగ్గుతోంది.

వేసవికి ముందే..

మొగల్తూరు మామిడి వ్యాపారం వేసవి సీజన్‌కు ముందే ప్రారంభమవుతుంది. శీతాకాలంలో పిందె దశలోనే రైతులు తోటల్లో పంటను విక్రయిస్తుంటారు. ఒక్కో చెట్టు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకూ విక్రయిస్తుంటారు.

ఆలస్యం.. వీటి ప్రత్యేకం

మొగల్తూరు మామిడి పండ్లు ఆలస్యంగా కాపునకు వస్తాయి. మే రెండో వారం నుంచి జూన్, జూలై నెలల్లో కూడా ఇవి అందుబాటులో ఉంటాయి. ఈ క్రమంలో ఇప్పుడిప్పుడే మామిడి పండ్లు మార్కెట్‌కు వస్తున్నాయి. ప్రస్తుతం మొగల్తూరు మామిడి పండ్లు పరక రూ.250 ధర పలుకుతోంది. బంగినపల్లి రకం డిమాండ్‌ను బట్టి కాయ ఒకటి రూ.40 నుంచి రూ.80కు విక్రయిస్తున్నాయి.

కాపు అంతంతమాత్రం



ఈ ఏడాది కాపు అంతంత మాత్రంగా ఉంది. మూడేళ్ల నుంచి కాపు సరిగా లేక, తెగుళ్లతో ఇబ్బంది పడుతున్నాం. సరైన ఆదాయం లేదు. ఈ ఏడాదీ ఆదాయం పెరిగే సూచనలు లేవు. రెండు, మూడు రోజుల నుంచి కాయల దిగుబడి వస్తోంది. మరో వారంలో పూర్తిస్థాయిలో మార్కెట్‌లోకి కాయలు వస్తాయి.

– అడ్డాల శ్రీరంగం, రైతు, మొగల్తూరు

తోటలు తగ్గిపోతున్నాయి



ఏటేటా తోటలు తగ్గిపోతున్నాయి. తోటలు నరికేసి లేఅవుట్స్ వేస్తున్నారు. ఆలస్యంగా కాపు కాయడంతో మిగిలిన చోట్ల సీజన్ అయిపోతుందనగా ఇక్కడ ప్రారంభమవుతుంది. దీంతో వీటికి డిమాండ్ ఎక్కువ. ముఖ్యంగా దేశ, విదేశాల్లోని బంధువులకు, స్నేహితులకు వీటిని పంపిస్తారు.

– కొప్పినీడి శ్రీనివాస్, రైతు, పేరుపాలెం

ఫ్లాట్లు.. పడిగాపులు

భీమవరంలో 8,352 మందికి ఫ్లాట్లు మంజూరయ్యాయి. వీటిలో 300 చదరపు అడుగుల సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్లు 3,520 ఉండగా, 365 చ.అ. సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్లు 3,520, 430 చ.అ. డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్లు 1,312 ఉన్నాయి. 2,944 ఫ్లాట్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయగా వీటిలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాగ్దానం మేరకు లబ్ధిదారులకు ఉచితంగా ఇచ్చిన 300 చ.అ ఫ్లాట్లు సుమారు 1,218, మిగిలిన కేటగిరీల్లోనివి 1,726 ఉన్నాయి. ఇంకా 5,408 ఫ్లాట్లు అప్పగించాల్సి ఉండగా పెయింటింగ్స్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ తదితర పనులు చేయాల్సి ఉంది. రెండో సైట్‌లో ఓవర్ హెడ్ ట్యాంకు ఇంకా పిల్లర్ల దశలోనే ఉంది. అప్రోచ్ రోడ్డు, ఫ్లాట్ల వద్ద రోడ్లు, డ్రెయిన్లు, ఎస్‌టీపీ ప్లాంట్లు నిర్మించాల్సి ఉంది. ఈ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి.

గూడు.. గోడు

- శ్రావణంలో టిడ్కో ఫ్లాట్లు ఇస్తామంటూ ఎన్నికల్లో నిమ్మల ప్రచారం
- శ్రావణం వెళ్లి ఏడు నెలలైనా మంత్రి ఇలాకాలో పూర్తికాని పనులు
- జిల్లాలోని నాలుగు పట్టణాల్లో 21,144 ఫ్లాట్ల మంజూరు
- గత ప్రభుత్వంలోనే 8,736 మందికి ఇళ్లు స్వాధీనం
- మిగిలిన లబ్ధిదారుల ఎదురుచూపులు

జిల్లాలో టిడ్కో ఫ్లాట్ల వివరాలు

పట్టణం	ఫ్లాట్లు	అప్పగించినవి	అప్పగించాల్సినవి
భీమవరం	8,352	2,944	5,408
పాలకొల్లు	6,144	2,560	3,584
తణుకు	912	0	912
తాడేపల్లిగూడెం	5,376	3,232	2,144

ఈసారి మన ప్రభుత్వమే

అధికారంలోకి వస్తుంది. అన్ని పనులు పూర్తిచేసి శ్రావణ మాసంలో లబ్ధిదారులు అందరికీ టిడ్కో ఫ్లాట్లు అప్పగించే బాధ్యత తీసుకుంటాం. – నిమ్మల రామానాయుడు

ఎన్నికల ప్రచారంలో భాగంగా పాలకొల్లులో పదే పదే ఈ విషయం చెబుతూ వచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చింది. నిమ్మలను మంత్రి పదవి వరించింది. శ్రావణ మాసం వచ్చి అప్పుడే ఏడు నెలలు గడిచిపోయింది. లబ్ధిదారులకు మాత్రం ఫ్లాట్లు రాలేదు. ఎప్పుడు అప్పగిస్తారో స్పష్టత లేదు.

సాక్షి, భీమవరం: పట్టణ ప్రాంతాల్లోని పేదల కోసం 2016లో కేంద్రం అందరికీ ఇళ్ల పథకాన్ని తెచ్చింది. జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకులో 21,144 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారు. టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిడ్కో) పర్యవేక్షణలో షీర్‌వాల్ టెక్నాలజీ విధానంలో నాటి టీడీపీ ప్రభుత్వం ఫ్లాట్ల నిర్మాణం చేపట్టింది. 2019 ఎన్నికలకు ముందు ప్రజలను మభ్య పెట్టేందుకు ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల పనులు పూర్తికాకుండానే హడావుడిగా ప్రారంభోత్సవాలు చేయించి చేతులు దులుపుకుంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చొరవ

పనులు పూర్తిచేసి లబ్ధిదారులకు ఇళ్లను స్వాధీనం చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవ చూపింది. తాగునీరు, సెప్టిక్ ట్యాంకు, రోడ్లు, డ్రెయిన్లు, మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టింది. జిల్లాలోని 8,736 ఫ్లాట్లను లబ్ధిదారులకు అప్పగించింది. మాజీ సీఎం జగన్ మాట ప్రకారం 300 చ.అ ఫ్లాట్లను లబ్ధిదారులకు పూర్తి ఉచితంగా ఇవ్వగా, 365 చ.అ కేటగిరీలో లబ్ధిదారుల డిపాజిట్ సొమ్ములో రూ.25 వేలు, 430 చ.అ కేటగిరీలో రూ.50 వేలు మినహాయింపు ఇచ్చారు.



భీమవరంలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఫ్లాట్లు

నత్తనడకన పనులు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలైనా ఇంకా పనులు పూర్తి చేయలేదు. టిడ్కో గృహాల వద్ద మౌలిక వసతుల పనులు నత్తనడకన సాగుతున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం 11,136 ఫ్లాట్లలో 4,668 ఇళ్లు 90 శాతం, 6,368 ఇళ్లు 95 శాతం పూర్తయ్యాయి. నిర్మాణ పనుల కోసం 9,400 మంది లబ్ధిదారుల పేరిట సుమారు రూ.250 కోట్ల మేర బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నా చాలా మందికి ఫ్లాట్లు స్వాధీనం చేయలేదు. దీంతో ఇంటి అద్దెతో పాటు బ్యాంకు వాయిదాలు చెల్లించేందుకు అవస్థలు పడాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు.

న్యూస్‌రీల్

సీహెచ్‌ఓల ధర్నాకు మద్దతు



జేసీకి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం కలెక్టరేట్ వద్ద ఐదు రోజులుగా ధర్నా చేస్తున్న విలేజ్ క్లినిక్‌ల సీహెచ్‌ఓలకు ఎమ్మెల్సీ గోపిమూర్తి శుక్రవారం మద్దతు తెలిపారు. సమస్యను ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళతానన్నారు. అనంతరం సీహెచ్‌ఓలతో కలిసి జేసీ రాహుల్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.

మావుళ్లమ్మ సన్నిధిలో కలెక్టర్



కలెక్టర్‌కు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం మావుళ్లమ్మవారిని శుక్రవారం కలెక్టర్ సీహెచ్ నాగరాణి దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం పండితులు ఆమెకు వేద ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం అందించారు. ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ, ఆలయ సిబ్బంది నల్లం లోకనాథం తదితరులు ఉన్నారు.

రమేష్‌కు 'అకడమిక్' అవార్డు



అవార్డు అందుకుంటున్న రమేష్

పాలకోడేరు: తమ కళాశాల అకడమిక్ అడ్వైజర్, మెంటర్ పి.వెంకట రమేష్ అకడమిక్ అడ్వైజర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్నట్టు బైట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కొవ్వర్తి సురేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏషియా టుడే మీడియా సంస్థ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జరిగిన విశ్వ విద్యా సమ్మేళనం–2025లో కేంద్ర మంత్రి చేతులమీదుగా రమేష్ అవార్డు అందుకున్నారన్నారు. కళాశాల చైర్మన్ అడబాల శ్రీ వెంకటేశ్వరరావు, సెక్రటరీ, కరస్పాండెంట్ అడ్డాల శ్రీహరి, డీన్‌కురెళ్ల భాస్కరరావు, హెచ్‌ఓడీలు రమేష్‌ను అభినందించారు.

జిల్లా నుంచి 7,500 మంది తరలింపు



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశంచౌక్): అమరావతి రాజధాని పునర్నిర్మాణ కార్యక్రమ సభకు పశ్చిమ గోదావరి జిల్లా నుంచి బయలుదేరి వెళ్లే బస్సులను కలెక్టర్ సీహెచ్ నాగరాణి శుక్రవారం భీమవరం పాత బస్టాండ్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సభ కోసం సీఎం చంద్రబాబు ఆదేశాలతో 150 బస్సుల్లో 7,500 మంది ప్రజలు జిల్లా నుంచి బయలుదేరి వెళ్లారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వైద్య విద్యలో ప్రవేశానికి ఏటా ఆన్‌లైన్‌లో నిర్వహించే నీట్ (యూజీ) పరీక్షను ఈ ఏడాది పెన్, పేపర్ పద్ధతిలో నిర్వహిస్తున్నారని, జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కేంద్రీయ విద్యాలయం (గోపన్న పాలెం), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గోపన్నపాలెం), సుబ్బమ్మదేవి మున్సిపల్ ఉన్నత పాఠశాల (ఏలూరు), కస్తూరిబా మున్సిపల్ బాలికా ఉన్నత పాఠశాల (ఏలూరు), ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఏలూరు)లో ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించరన్నారు. విద్యార్థులు నిబంధనలు పాటించాలని డీఈఓ వెంకటలక్ష్మమ్మ, నీట్ కో–ఆర్డినేటర్ భూర్ సింగ్ మీనా తెలిపారు.

● ప్రయాణం వేళ.. జనం విలవిల



ఏలూరు కొత్త బస్టాండ్ ఇలా..



వెలవెలబోతున్న అమరావతి సభకు వెళ్లే ఓ బస్సు



బస్సుల కోసం ఏలూరులో వేచి ఉన్న ప్రయాణికులు

అమరావతిలో జరిగిన ప్రధాని సభకు జనాన్ని తరలించేందుకు బస్సులు కేటాయించడంతో శుక్రవారం ఏలూరు కొత్త బస్టాండ్, పాత బస్టాండ్‌లో ప్రయాణానికి ఆర్టీసీ బస్సులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. కొందరు చంటి బిడ్డలతో ఎండలో పడిగాపులు కాశారు. బస్సుల రాకపోకలు లేక కొత్త బస్టాండ్ కర్ఫ్యూను తలపించింది. మరోపక్క ప్రధాని సభకు ఎండలో రామంటున్న డ్వాక్రా మహిళలను బెదిరించి మరీ అధికారులు బస్సుల్లో కూర్చోబెట్టారు. కొన్ని బస్సులు ఐదారుగురితోనే అమరావతికి పయనమయ్యాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు

పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈనెల 12 నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును మూడు రోజులపాటు పొడిగించినట్టు ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహాన్ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈనెల 5 వరకు అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

జడ్జీల బాధ్యతల స్వీకరణ

నూజివీడు: నూజివీడుకు బదిలీ అయిన పలువురు జడ్జీలు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఓ.అనూష (నెల్లూరు), రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి (జగ్గయ్యపేట) బాధ్యతలను చేపట్టారు. నూజివీడులో రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి ఇక్కడే ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించారు. న్యాయవాదులు వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

4న ప్రభుత్వ ఉద్యోగుల సంఘ ఎన్నికలు

ఏలూరు (టూటౌన్): ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఏలూరు తాలూకా ఎన్నికలు ఈనెల 4న టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న సంఘ కార్యాలయంలో జరుగుతాయని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాము, ఎస్‌ఎస్‌వీ రామకృష్ణారావు, ఎన్నికల అధికారి వై.శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. అలాగే రాష్ట్ర మహాసభ జూన్‌లో విజయవాడలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

7 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు మైలవరంలోని ఆయన చాంబర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈనెల 7 నుంచి 14 వరకు జరిగే ఉత్సవాల విశేషాలను ఆయన వెల్లడించారు. 7న ఉదయం శ్రీవారిని పెండ్లి కుమారుడిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా ముస్తాబు చేయడం, 8న అంకురార్పణ, రుత్విగ్వరణ, ధ్వజారోహణ, 9న సూర్యప్రభ, చంద్ర ప్రభ వాహనాలపై తిరువీధి సేవలు, 10న రాత్రి ఎదుర్కోలు ఉత్సవం జరుగుతుందన్నారు. 11న రాత్రి శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం, 12న రాత్రి రథోత్సవం, 13న చక్రవారి–అవభృథోత్సవం, వేద సభ, ధ్వజావరోహణ వేడుకలు నిర్వహిస్తామన్నారు. 14న చూర్ణోత్సవం, వసంతోత్సవం, ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగం–పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. స్వామివారు రోజుకో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తారని చెప్పారు. ఉత్సవాల నేపథ్యంలో ఈనెల 7 నుంచి 14 వరకు ఆలయంలో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు చెప్పారు. ఆలయ అనువంశిక ధర్మకర్త నివృతరావు, డీఈఓ బాబూరావు, ఏఈఓ పి.నటరాజారావు పాల్గొన్నారు.

మన్యం బంద్ ప్రశాంతం

బుట్టాయగూడెం: గిరిజన నిరుద్యోగులకు ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని కోరుతూ గిరిజన సంఘాల పిలుపు మేరకు పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో శుక్రవారం మన్యం బంద్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం నుంచే గిరిజన సంఘాల నాయకులు బంద్‌లో పాల్గొన్నారు. దుకాణాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. బుట్టాయగూడెం బస్టాప్ సెంటర్‌లో బైటాయించిన ఏపీ గిరిజన సంఘం నాయకులు తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి, పోలోజు నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు జీఓ 3కి ప్రత్యామ్నాయంగా ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ వల్ల గిరిజన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. జీలుగుమిల్లి, పోలవరం, కుక్కునూరు మండలాల్లో బంద్ విజయవంతమైంది.

వేలేరుపాడులో బైక్ ర్యాలీ

వేలేరుపాడు: వేలేరుపాడులో బంద్‌ను గిరిజన సంఘాలు ప్రశాంతంగా నిర్వహించాయి. తొలుత వేలేరుపాడు గ్రామం నుంచి భూదేవిపేట వరకు బైక్ ర్యాలీ జరిగింది.

క్లుప్తంగా

జోరుగా మట్టి అక్రమ రవాణా



కన్నాయిగూడెం సమీపంలోని చెరువులో మట్టి తోలకాలు

కొయ్యలగూడెం : పొంగుటూరు పంచాయతీ కన్నాయగూడెం ఊర చెరువులో మట్టి అక్రమాలు జోరుగా సాగుతున్నాయి. తెల్లవారు జాము వరకు అక్రమార్కులు జేసీబీలతో టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. అధికారుల అండతో చట్టవిరుద్ధంగా తవ్వకాలు సాగిస్తున్నారని గ్రామస్తుల ఆరోపిస్తున్నారు. ఊర చెరువులో పశువుల కోసం ఉంచిన తాగు నీటిని కూడా ఇంజిన్లతో తోడి అక్రమార్కులు తమకు అనువుగా ర్యాంపులను నిర్మించి మట్టి తోలకాలు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్, మైనింగ్ శాఖల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా, అధికారుల సహకారంతోనే ఈ తవ్వకాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీడబ్ల్యుఏడి పరిధిలోని నందాల చెరువు, శ్రీరామ కట్టు, భీముని చెరువుల్లో రాత్రి వేళ రహస్యంగా తోలకాలు చేస్తున్నారు. తవ్వకాలు జరిపే వారి గురించి అధికారులకు సమాచారం ఇచ్చిన కొద్ది నిమిషాల్లోనే జేసీబీలు, టిప్పర్లు మాయమవుతున్నాయి. తవ్వకాల వల్ల చెరువు ఆకారం మారిపోతూ, భవిష్యత్తులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

జెడ్పీలో పదోన్నతులు

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో పలువురు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారు. ముగ్గురు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు ఎంపీడీవోలుగా, సీనియర్ అసిస్టెంట్లు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లుగా పదోన్నతి పొందారు. ఈ మేరకు వారికి ప్రమోషన్ ఉత్తర్వులను జెడ్పీ చైర్‌పర్సన్ జి.పద్మశ్రీ శుక్రవారం స్థానిక జెడ్పీ కార్యాలయంలో అందజేశారు.

బర్డ్ హాస్పిటల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా జగదీష్



డాక్టర్ గుదారు జగదీష్

ద్వారకాతిరుమల: టీటీడీ బర్డ్ హాస్పిటల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా ద్వారకాతిరుమల విర్డ్ హాస్పిటల్ మాజీ డైరెక్టర్, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ గుదారు జగదీష్ నియమితులయ్యారు. ఈ మేరకు టీటీడీ ఈఓ శ్యామలరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ జగదీష్ గతంలో బర్డ్ హాస్పిటల్ డైరెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఇదిలా ఉంటే గత నెల 2న అమరావతిలో సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయం, టీటీడీ బర్డ్ హాస్పిటల్ ట్రస్ట్ బోర్డు ఆమోదం మేరకు ఈఓ శ్యామలరావు ఉత్తర్వులిచ్చారు. డాక్టర్ జగదీష్ బర్డ్ హాస్పిటల్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా కాంట్రాక్టు ప్రాతిపదికన ఏడాది పాటు కొనసాగుతారు.

అన్న కొడుకుపై కత్తితో దాడి

పెంటపాడు: ఇంట్లో ఫ్యాన్ ఏర్పాటుపై వివాదం ఏర్పడి అన్న కొడుకుపై చిన్నాన దాడి చేసిన సంఘటన పరిమెళ్లలో చోటు చేసుకొంది. పెంటపాడు ఎస్సై కె.స్వామి తెలిపిన వివరాల ప్రకారం పరిమెళ్లకు చెందిన అన్నదమ్ములు వెన్నపు రాంబాబు, తన అన్న వెన్నపు రామకృష్ణలు రెండు పోర్షన్ల ఇంట్లో ఉంటున్నారు. బుధవారం రాంబాబు తన ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ బిగించుకుంటున్నాడు. ఈ విషయంపై అన్న కొడుకైన నాగరాజుతో వాగ్వాదం జరిగింది. రాత్రి మళ్లీ ఘర్షణ పడగా.. చాకుతో నాగరాజుపై రాంబాబు దాడికి చేశాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం గూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కొల్లేరు అందాలు కనుమరుగు

- నెర్రలిచ్చి ఎడారిలా మారిన సరస్సు
- కలగా మిగిలిన తాటి దోనెలపై వేట.. లాంచీలపై ప్రయాణం

ఒకనాటి కొల్లేరు అందాలు నేడు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. మానవ తప్పిదం కారణంగా కొల్లేరు ఎడారిగా మారింది. జలసిరులతో కళకళలాడిన కొల్లేరు నెర్రలిచ్చి వెక్కిరిస్తోంది. తాటి దోనెల స్థానాన్ని ఇనుప డొంగ్రీలు ఆక్రమించాయి. లాంచీల ప్రయాణం చరిత్రలో కలిసిపోయింది.



కొల్లేరులో అటవీశాఖ నిర్వహించిన తాటి దోనెల పోటీ(ఫైల్)



కొల్లేరులో కనుమరుగైన తాటిదోనెలపై చేపల వేట



సరస్సులో కనుమరుగైన లాంచీ ప్రయాణం

కైకలూరు : కొల్లేరు పేరు చెప్పగానే పక్షుల కిలకిలరావాలతో పాటు కొల్లేరులో ప్రయాణం మదిలో మెదులుతుంది. ఒకప్పటి కొల్లేరును, ఇప్పుడున్న పరిస్థితిని పరిశీలిస్తే.. ఆకులు రాలి ఎండిన మోడులా కనిపిస్తుంది. ముందు రోజు పట్టి నీటిలో ఉంచిన చేపలను తెల్లవారుజామునే మార్కెట్‌లో విక్రయించి జీవించేవారు. నేడు ఇలాంటి దృశ్యాలు కొల్లేరులో కానరావడం లేదు. కొల్లేరు జీవనానికి అద్దం పట్టే తిప్పతీగలతో మావులు(చేపలు పట్టడానికి వాడే బుట్టలు) అల్లే కార్మికుల జాడే లేదు. ఎంతో స్వచ్ఛంగా ఉండే కొల్లేరు నీరు నేడు కాలకూట విషంగా మారింది. కొల్లేరు పూర్వపు అందాలు భవిష్యత్తు తరాలకు పూర్తిగా కనుమరుగయ్యాయి.

లాంచీల ధ్వనులు మాయం

రాష్ట్రంలో కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతరకు ప్రత్యేక స్థానం ఉంది. తెలంగాణలో సమక్క, సారక్క జాతరకు అడవులు దాటి వెళ్లాలి. పెద్దింట్లమ్మ జాతరకు పూర్వం కొల్లేరు నీటిలో లాంచీలు, పడవలపై ప్రయాణించాలి. సూర్యుడు ఉదయిస్తున్న వేళ అప్పుడే విచ్చుకుంటున్న కొల్లేరు కలువ పువ్వల మధ్య ప్రయాణం మధురానుభూతి కలిగిస్తోంది. ఏటా జాతకు సర్కారు కాల్వ నుంచి అమ్మవారి దేవస్థానం వరకు 70 లాంచీలు తిరిగేవి. వీటికి పడవలు అదనం. ఇదే కాకుండా కొల్లేటికోట నుంచి ఆకివీడు, పెద ఎడ్లగాడి, చిన ఎడ్లగాడి, నందిగామలంక వరకు లాంచీలు తిరిగేవి. ఒక్కో లాంచీలో 100 మంది ప్రయాణించేవారు. జాతరకు రాజమండ్రి, విజయవాడ, యానాం, ధవళేశ్వరం నుంచి కాల్వల ద్వారా లాంచీలు కొల్లేరుకు వచ్చేవి. నేడు నీటి కొరత కారణంగా ఒక్క లాంచీ కనిపించడం లేదు.

కొల్లేరు సరస్సులో వేట సాగించే ప్రజలకు పేదోడి రాకెట్‌గా తాటిదోనెకు పేరుంది. బలమైన తాటిచెట్టును ఎంపిక చేసి మొదలతో సహా తీసుకొచ్చి 15 రోజులు బరిసెలతో చెక్కేవారు. నీరు చేరకుండా తారును అద్దేవారు. దీనిలో ఇద్దరు కూర్చుని ప్రయాణించేవారు. తాటిదోనెలను నడపడం ఎంతో కష్టం. ఏ మాత్రం బ్యాలెన్స్ తప్పిన బోర్లా పడతారు. తాటిదోనె తయారీ రూ.350 నుంచి రూ.15,000కు చేరింది. తర్వాత ఇనుముతో చేసిన డొంగ్రీలు అందుబాటులోకి వచ్చాయి. ఒక్కో డొంగ్రీ రూ.35,000 నుంచి రూ.40,000 పలుకుతోంది. తాటిదోనెల్లో వేటాడే సమయంలో సరస్సులో సహజసిద్ధ చేపలకు తాకినా వాటికి ప్రమాదం ఉండేది కాదు. ఇనుప డొంగ్రీల వల్ల చేపలు గాయపడుతున్నాయి. దోనెల తయారీదారులు తగ్గిపోయారు. తాటిచెట్ల కొరత ఏర్పడింది.

లాంచీలతో ఆదాయం బాగుండేది



నాకు 6 లాంచీలు ఉండేవి. **సర్కారు కాల్వ నుంచి** పెద్దింట్లమ్మ దేవస్థానానికి భక్తులను తీసుకెళ్లేవాడిని. లాంచీలపై వచ్చే ఆదాయంతో జీవించేవాళ్లం. నేడు కొల్లేరు సరస్సులో నీరు లేదు. పైగా గుర్రపుడెక్క పేరుకుపోయింది. దీంతో లాంచీలు వెళ్ళలేని పరిస్థితి.

– వై.త్రిమూర్తులు, లాంచీల యజమాని, గోకర్ణపురం

తాటి దోనెలు నడపడం కళ



కొల్లేరులో తాటిదోనెలు నడపడం పెద్ద కళ. ఇతర ప్రాంతాల ప్రజలు వీటిని నడపలేరు. కొన్ని సంవత్సరాల క్రితం అటవీశాఖ చిత్తడి నేలల దినోత్సవం రోజున సర్కారు కాల్వ వద్ద తాటిదోనెల పోటీలు నిర్వహించారు. కేరళ తరహా పడవల పోటీల మాదిరిగా కొల్లేరులో దోనెల పోటీలు నిర్వహిస్తే సంప్రదాయ దోనెల వేట తిరిగి జీవం పోసుకుంటుంది.

బలే సముద్రుడు, గ్రామపెద్ద, పందిరిపల్లిగూడెం

మానవ తప్పిదాలతో ప్రమాదం

సరస్సుకి సమీప పట్టణాల నుంచి 19 ఫ్యాక్టరీల వ్యర్థజలాలు కొల్లేరులో చేరుతున్నాయని అంచనా. దీని కారణంగా సరస్సులో నల్లజాతి చేపలు అంతరిస్తున్నాయి. డ్రెయిన్లు, వాగుల ద్వారా కొల్లేరుకు చేరే నీటి వనరులు తగ్గాయి. ప్రధానంగా ఎగువ నుంచి కొల్లేరుకు చేరుతున్న నీటిని సరస్సు మధ్యలో అక్రమ చేపల సాగుదారులు చెరువులకు తోడుతున్నారు. దీంతో కొల్లేరులో నీరు కనిపించడం లేదు. ఈ కారణంతో ప్రజలకు చేపల వేట కరువవుతోంది. రెగ్యులేటర్లు నిర్మిస్తే కొల్లేరుకు తిరిగి పూర్వ వైభవం వస్తుందని భావిస్తున్నారు.

పంటల్లో పెరిగిన ఎరువుల వినియోగం



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ పరిశోధన సంచాలకుడు పీవీ సత్యనారాయణ

పెనుమంట్ర : వరి, మొక్కజొన్న లాంటి పంటల్లో ఎరువుల వినియోగం చాలా ఎక్కువగా ఉందని, దానికి తగ్గట్టు దిగుబడిలో పెరుగుదల కనిపిస్తుందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకుడు డాక్టర్ పీవీ సత్యనారాయణ అన్నారు. మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో రెండో రోజు గోదావరి మండల పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవిష్యత్‌లో డ్రోన్‌ల వినియోగం పెరిగే అవకాశం ఉందని, సిఫార్సు చేస్తున్న పురుగు మందుల మోతాదును కూడా పునః పరిశీలన చేయాల్సిన అవసరం ఉందన్నారు. విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి శివనారాయణ మాట్లాడుతూ పరిశోధనా స్థానాలు, విత్తనోత్పత్తి సంస్థలపై భారం తగ్గించడానికి రైతు విత్తనోత్పత్తిదారులను గ్రామాలలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని విస్తరణ కేంద్రాలను ఆదేశించారు. వరి ఎగుమతిదారుల సంఘం అధ్యక్షుడు బీవీ కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో పండించే 127 లక్షల టన్నుల ధాన్యం నుంచి సుమారు 80 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తి అవుతుందని, మన రాష్ట్ర అవసరాలకు సుమారు 50 లక్షల టన్నుల బియ్యం సరిపోతుందని, మిగిలిన 30 లక్షల టన్నుల బియ్యాన్ని బాసుమతి యేతర రకాల కేటగిరి కింద ఇతర దేశాలకు ఎగుమతి చేయడం వల్ల రైతులకు అధిక ఆదాయంతో పాటు రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి మరింత మేలు జరిగే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకుడు డాక్టర్ టి.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

నేత్రపర్వం చాత్మార్ ఉత్సవం



తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధులకు పయనమైన స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల: శ్రీవారికి చాత్మార్ ఉత్సవం శుక్రవారం రాత్రి క్షేత్ర పురవీధుల్లో నేత్రపర్వంగా జరిగింది. శ్రీమద్రామానుజుల తిరు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ వేడుకను అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అర్చకులు తొళక్క వాహనంపై ఉంచి, సుగంధ భరిత పుష్పమాలికలతో అలంకరించారు. అనంతరం పూజాధికాలు జరిపి హారతులిచ్చారు. ఆ తరువాత స్వామివారి వాహనం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. ప్రతి ఇంటి ముంగిటా భక్తులు స్వామి, అమ్మవార్లకు నీరాజనాలు సమర్పించారు.

అదనపు బాధ్యతలకు రాజీనామా

నూజివీడు: ట్రిపుల్ ఐటీలో పలువురు బోధన ఉద్యోగులు తాము నిర్వర్తిస్తున్న అదనపు బాధ్యతలకు రాజీనామా చేస్తూ లేఖలను అధికారులకు అందజేశారు. తెలుగు అధ్యాపకులు జే సీతాపతి , పీవీ లక్ష్మణరావు, శ్రీహరి, సైకాలజీ ఫ్యాకల్టీ వేణుగోపాల్ తాము నిర్వర్తిస్తున్న పదవులకు రాజీనామా చేస్తూ లేఖలను అందించారు. మరో పదిరోజుల్లో ఈ విద్యాసంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో త్వరలోనే వారి రాజీనామాలను ఆమోదించి కొత్తవారిని నియమిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

ఆక్వా వేసవి సాగులో అప్రమత్తం

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో రైతుల ఆందోళన
- చుట్టుముడుతున్న వ్యాధులు
- ముందస్తు జాగ్రత్తలు మేలంటున్న మత్స్య విభాగ నిపుణులు



రొయ్యల సాగులో ఏరియేటర్లు (ఫైల్)



చేపల సాగు పట్టుబడి (ఫైల్)

కైకలూరు: ఉష్ణోగ్రతల పెరుగుదల ఆక్వాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు మేలని మత్స్యశాఖ నిపుణులు సూచిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో చేపలు, 1.10 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. మొత్తం 2.90 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఆక్వా సాగు జరుగుతోంది. వార్షిక ఉత్పత్తి 4 లక్షల టన్నులు కాగా.. వార్షిక టర్నోవర్ రూ.18 వేల కోట్లకుపైనే.. ప్రభుత్వానికి అధిక ఆదాయం తీసుకొచ్చే ఆక్వారంగం వేసవిలో నష్టాల పాలవుతోంది. నీటి కొరత, హెచ్చు ఉష్ణోగ్రతలతో చేపలు, రొయ్యలు వ్యాధుల బారినపడుతున్నాయి. వేసవిలో ఆక్వా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు కాకినాడకు చెందిన విశ్రాంత ఫిషరీస్ డిప్యూటీ డైరెక్టర్ పి.రామ్మోహనరావు వివరించారు

రొయ్యల, చేపల పెరుగుదల 28–32 డిగ్రీల ఉష్ణోగ్రత దగ్గర బాగుంటుంది. వేసవిలో నీటి ఉష్ణోగ్రత గణనీయంగా పెరిగి 35 డిగ్రీలు దాటుతోంది. ఈ పరిస్థితులలో నీటిలో ప్రాణవాయువు కరిగే శక్తి తగ్గుతుంది. అధిక ఉష్ణోగ్రతల వల్ల కొన్ని చెరువులలో (ముఖ్యంగా లోతు ఎక్కువున్న చెరువులలో) నీటి లెవల్స్ 3 అంతస్తులుగా వేరుపడుతుంది. దీనివల్ల చెరువు పైపొరలలో డీవో ఎక్కువగా, అడుగు పొరలలో డీవో తక్కువగా వుంటూ చేపలు, రొయ్యలకు ఇబ్బంది కలిగిస్తోంది. చెరువు నీటిలో అనవసరమైన, హానికారక శైవలాలు కూడా ఏర్పడతాయి. అధిక శైవలాల వల్ల నీటి పీహెచ్ పెరిగిపోతుంది. నీటి ఉష్ణోగ్రత, పీహెచ్ అధికంగా ఉన్నప్పుడు అమ్మోనియా స్థాయి పెరిగి రొయ్యలు, చేపలకు ఒత్తిడి కలిగించి వ్యాధులకు దారి తీస్తోంది. చిరు చేపలు, రొయ్యలు అధిక నీటి గుణాల తారతమ్యాలు తట్టుకోలేవు.

మేత యాజమాన్యం

వేసవిలో అధిక ఉష్ణోగ్రతలకు రొయ్యలు, చేపలు ఎక్కువ మేత తింటాయి. ఎక్కువ ఉష్ణోగ్రతల వద్ద(33 డిగ్రీలు దాటితే), ఎక్కువ మేతను తీసుకున్నా రొయ్యలలో పెరుగుదల పెద్దగా కనబడదు. రైతులు మేత యాజమాన్యం సరిగా చేయాలి. చేపలకు ఒక్కసారే మేత ఇస్తారు. అది ఉదయం 8 గంటల తర్వాత ఇవ్వడం మంచిది. రొయ్యలకు 4–5 సార్లు ఇచ్చే ఆహారం చెక్ ట్రేని బట్టి ఇవ్వాలి.

వ్యాధుల నివారణ ఇలా

వేసవిలో చేపలకు, రొయ్యలకు వివిధ రకాల వ్యాధులు వస్తాయి. వాటిని ఎప్పటికప్పుడు గమనిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. చేపలలో శంకు జలగ, రెడ్ డిసీజ్, ఇతర బ్యాక్టీరియా వ్యాధులు, పేను వంటి పరాన్న జీవుల వ్యాధులు వ్యాపిస్తాయి. రొయ్యలలో శరీరం వంపు తిరగడం (బోడి క్రాంప్స్) వైట్ గట్, వైట్ ఫీసెస్, వైట్ మజిల్, రన్నింగ్ మోర్టాలిటీ, విబ్రియో వంటి బాక్టీరియా విజృంభిస్తుంది. చెరువులో పెంచే చేప, రొయ్యలకు ఏవిధమైన ఒత్తిడి కలిగించకుండా చర్యలు చేపట్టాలి.

వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు



పి.రామ్మోహనరావు, విశ్రాంత ఫిషరీస్ డిప్యూటీ డైరెక్టర్

- చెరువు నీటి లోతు కనీసం 1.5 మీటర్లు ఉండాలి
- నీటిలో ఏరియేటర్లను క్రమపద్ధతిలో అమర్చి తిప్పుకోవాలి.
- నీటిలో డీవో స్థాయి తగ్గితే సర్దుబాటు కోసం హైడ్రోజన్ పెరాక్సైడ్, కాల్షియం పెరాక్సైడ్ వంటి రసాయనాలు అందుబాటులో ఉంచుకోవాలి.
- వారం వారం రొయ్యల మేతను చెక్ ట్రే ఆధారంగా లెక్కించి అవసరమైతేనే పెంచాలి.
- అనవసరంగా చెరువులో ఎరువులు వాడకూడదు.
- వ్యాధులకు అనుగుణంగా రసాయనాలు, ప్రోబయోటిక్స్ అందుబాటులో ఉంచుకోవాలి.
- కొత్తగా చెరువులో రొయ్య సీడ్ వేసే వారు, ముందుగా సీడ్(రొయ్య పిల్ల)ని చెరువు వాతావరణానికి అలవాటు చేసి వదలండి. దీని వల్ల నెంబరు తగ్గకుండా నిలబడుతుంది.

విద్యుదాఘాతంతో మృతి



మృతుడు రామకృష్ణ

నూజివీడు: మండలంలోని మీర్జాపురం హైస్కూల్ విద్యాకమిటీ చైర్మన్ పిన్నిబోయిన రామకృష్ణ (36) విద్యుత్‌షాక్‌తో గురువారం రాత్రి మృతిచెందారు. మీర్జాపురం శివారం కండ్రికలో రాత్రి 9 గంటల సమయంలో ఇంటి నుంచి బజారుకు వెళ్తుండగా కరెంటు స్తంభానికి చేయి తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే పడిపోయాడు. స్థానికులు, అతని కుటుంబ సభ్యులు హుటాహుటిన హనుమాన్ జంక్షన్‌లోని ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. రూరల్ ఎస్ఐ జ్యోతిబసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రామకృష్ణ మృతితో కుటుంబం ఆధారం కోల్పోయినట్లయింది. విద్యుత్ షాక్‌తో మృతిచెందిన పిన్నిబోయిన రామకృష్ణ కుటుంబ సభ్యులను శుక్రవారం గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారధి పరామర్శించారు.

సీపెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

యలమంచిలి :విజయవాడలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్)లో పదో తరగతి విద్యార్హతతో మూడేళ్ల వ్యవధి డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీపెట్ డైరెక్టర్ అండ్ హెడ్ సీహెచ్ శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ విద్యార్హతతో రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ కోర్సులకు మే 29లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జూన్ 8న పరీక్ష నిర్వహించి వచ్చిన ర్యాంక్ ఆధారంగా విజయవాడ కేంద్రంలో 150 సీట్లు భర్తీ చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కోర్సులు పూర్తిచేసిన వారికి ప్లాస్టిక్ రంగంలో జూనియర్ ఇంజనీర్ (ప్రొడక్షన్), మౌల్డ్ డిజైనర్ అండ్ మేకర్ జూనియర్ ఇంజనీర్, క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలు వస్తాయని వివరించారు. మరిన్ని వివరాలకు 9398050255 నెంబరులో సంప్రదించాలని కోరారు.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం

- ఏలూరులో అర్ధాంతరంగా పాఠశాల మూసివేత
- ఫీజులు వసూలు చేసి, పుస్తకాలు అమ్ముకున్న వైనం



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న తల్లిదండ్రులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో శాఖలుగా విస్తరించిన ఒక ప్రైవేటు విద్యా సంస్థ ఏలూరు పరిసర ప్రాంతాల విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతోంది. కొన్నేళ్ళుగా నగరంతో పాటు పరిసర ప్రాంతాల విద్యార్థులను పాఠశాలలో చేర్చుకుని, తల్లిదండ్రుల నమ్మకం సంపాదించి ఈ విద్యా సంవత్సరంలో ఎలాంటి సమాచారం లేకుండా పాఠశాలను మూసివేశారని తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. పాఠశాల మూసివేత సమయానికి సుమారు 300 మంది విద్యార్థులు ఉన్నట్లు చెబుతున్నారు. పాఠశాల మూసివేసే ఆలోచన ఉంటే ఒక ఏడాది ముందుగా విద్యార్థుల తల్లిదండ్రుల దృష్టిలో పెట్టాలని, పాఠశాల యాజమాన్యం అలా చేయకుండా గుట్టుచప్పుడు కాకుండా మూసివేసి తమ బిడ్డలకు మరో పాఠశాలలో ప్రవేశాలు పొందే అవకాశం కూడా లేకుండా చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏడాదంతా మూసివేత విషయం చెప్పకుండా వారం క్రితం మాత్రమే సమావేశం పెట్టి ఈ విషయం చెప్పారని మండిపడుతున్నారు. పాఠశాల మూసివేత విషయాన్ని గోప్యంగా ఉంచి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజులు వసూలు చేసుకున్నారని, ఫీజుల చెల్లింపునకు కొంత సమయం కావాలని వేడుకున్నా ప్రిన్సిపాల్ ససేమిరా అంటూ పిల్లలను ఇబ్బందులకు గురిచేశారని వాపోతున్నారు. ఉచిత సీట్లు పొందిన వారి నుంచి సైతం ఫీజులు వసూలు చేశారని, ఫీజులు చెల్లించకపోతే ఇబ్బందులకు గురి చేశారని తల్లిదండ్రులు చెబుతున్నారు. పాఠశాలకు వెళ్ళి తమ బిడ్డల టీసీలు ఇవ్వాలని కోరగా విజయవాడ వెళ్ళి తీసుకోవాలని, ప్రిన్సిపాల్, డీన్ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల అక్రమంగా మూసివేసి తమ బిడ్డల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేసిన ఆ విద్యా సంస్థ యాజమాన్యంపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మను కలిసి వినతిపత్రం సమర్పించారు. తన కుమార్తెకు ఉచిత సీట్ల కోటాలో సీటు వచ్చినా ఫీజు చెల్లించాల్సిందేనని చెప్పగా.. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేశాను, అయినా చర్యలు తీసుకోలేదని లంకపేటకు చెందిన ఎన్.దుర్గా నాగేంద్రరావు ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడు ఈ ఏడాది 10లోకి వచ్చాడని, కొన్ని రోజులు తరగతులు నిర్వహించి పుస్తకాలు కొనుగోలు చేయాలని రూ.13 వేలు వసూలు చేసి ఇప్పుడు స్కూలు మూసేయడం అన్యాయమని ఏలూరుకు చెందిన వి.నాగలక్ష్మి తప్పుపట్టారు.

క్లుప్తంగా

దుర్గమ్మకు విశేష పూజలు



అన్నసమారాదన దృశ్యం

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులో కనకదుర్గమ్మ అమ్మవారికి శుక్రవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అలాగే అమ్మవారి ఆలయంలో అన్నదానం ఏర్పాటు కార్యక్రమాన్ని గ్రామస్తులు, భక్తుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆలయ అర్చకులు సాతులూరి పవన్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ అధ్యక్షుడు బడేటి ఉదయభాను, గ్రామస్తులు, దాతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి శుక్రవారం అమ్మవారి ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిరాటంకంగా జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి గ్రామోత్సవం



విశేష అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక పాతూరులో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా ఆలయ దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం రెండో రోజు విశేష పూజలు జరిగాయి. ఆలయ కార్యనిర్వాహణ అధికారి పాప్పాప్పు హరే రామ ప్రసాద్, ఆలయ కమిటీ నిర్వహకులు దూసనపూడి రమేష్ కుమార్ ఆధ్వర్యంలో పండితులు వాడపల్లి మాధవాచార్యులు, అగ్నిహోత్రం సుందరరామానుజాచార్యులు బ్రహ్మత్వంలో నవకలశ, సప్తకలశ అభిషేకాలు, పంచగవ్యాధివాస, క్షీరాధివాస, జలాధివాస, అధివాస ప్రధాన హోమాలు నిర్వహించారు. సాయంత్రం ఘనంగా స్వామివారి గ్రామోత్సవం జరిగింది. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా నేడు ఆలయ పునఃప్రతిష్ఠ: శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునఃనిర్మాణం, ద్వారపాలక పునఃప్రతిష్ఠ, స్వామి వారి శాంతి కల్యాణం, ఆంజనేయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠలు శనివారం జరగనున్నాయి. మధ్యాహ్నం భారీ అన్నసమారాధనలు నిర్వహించనున్నారు.

సుగర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సుగర్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండానలి డాక్టర్ ఎల్.రవికుమార్ అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జనతా ట్రస్ట్ నిర్వహణలో అధ్యక్షుడు వీవీఎస్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో దాత దాట్ల లక్ష్మీపతిరాజు ఆర్థిక సహాయంతో శుక్రవారం స్థానిక జనతా ట్రస్ట్ ఆవరణలో ఉచిత సుగర్ రక్త పరీక్షల శిబిరం నిర్వహించారు. సుగర్ వ్యాధిపై అవగాహన సదస్సు జరిగింది. రవికుమార్ మాట్లాడుతూ తగిన వ్యాయమం, మిత ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధిని అదుపులో పెట్టవచ్చన్నారు. తగు సూచనలు ఇచ్చారు. 117 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చిన్నం జగదీష్, సుంకర శ్రీనివాస్, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, సన్నిధి సూర్యనారాయణ మూర్తి, గరికపాటి బాపయ్య శర్మ, పేరూరి కాశయ్య, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

తణుకు అర్బన్: న్యాయవాదులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం న్యాయవాదుల సమస్యలను తెలియజేస్తూ కోర్టు ఆవరణలో కరపత్రాలను న్యాయవాదులుకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు న్యాయవాదుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చి ఉన్నారని వాటిని అమలు చేయాలని కోరారు. నేడు న్యాయవాదులు అనేక సమస్యలతో ఉన్నారని జూనియర్ న్యాయవాదులకు న్యాయమిత్ర పథకం ద్వారా ప్రతినెల రూ. 5వేలు శిక్షణ నిమిత్తం భృతిగా ఇస్తానని చెప్పినప్పటికీ ఇంతవరకు డబ్బులు విడుదల చేయకుండా పెండింగ్‌లో పెట్టారని స్పష్టం చేశారు. న్యాయవాదులకు ముఖ్యమంత్రి 100 కోట్ల రూపాయలు కార్పస్ ఫండ్, వైద్య ఖర్చుల కోసం రూ. 5 లక్షలు, ప్రమాదంలో మరణిస్తే రూ.15 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. న్యాయవాదులు మల్లిపూడి సువర్ణ రాజు, అనుకుల రమేష్, కౌరు వెంకటేశ్వర్లు, ఉడతల పూల్లేశ్వరరావు, పి.ప్రభాకర్ రావు, పి.శ్రీనివాసరావుఉన్నారు.

వసూళ్లలో జిల్లాలో అగ్రగామి

- గూడెం మున్సిపాలిటీకి పెరిగిన ఆదాయం
- పన్నుల వసూళ్లలో రాష్ట్రంలో మూడో స్థానం



తాడేపల్లిగూడెం మునిసిపల్ కార్యాలయం

తాడేపల్లిగూడెం: పన్నుల వసూళ్లలో తాడేపల్లి గూడెం మున్సిపాలిటీ జిల్లాలో అగ్రగామిగా నిలిచింది. రాష్ట్రంలో మూడో స్థానంలో ఉంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆదాయం అనూహ్యంగా పెరిగింది. ఇంటి పన్ను, ఖాళీ జాగాల పన్నుల ఆదాయం పెరగగా, పురపాలక దుకాణాల ఆదాయం తగ్గింది. బకాయి వసూళ్లను వేగవంతం చేయడం, సచివాలయ వ్యవస్థ ఉద్యోగులు అందుబాటులో ఉండటంతో వసూళ్లు అనుకున్న స్థాయికి చేరుకున్నాయి. ఇటీవల గూడెంలో నిర్వహించిన జిల్లా మున్సిపల్ కమిషనర్ల సమావేశంలో రాజమండ్రి ప్రాంతీయ కార్యాలయ అధికారి సీహెచ్ నాగ నరసింహరావు గూడెం కమిషనర్ ఎం.ఏసుబాబును ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రం అందజేశారు.

మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాలు ఇలా

గత ఆర్థిక సంవత్సరం (2023–24)తో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో అదనంగా రూ.రెండు కోట్ల ఆదాయం పెరిగింది. ఆస్తి పన్ను కింద గత ఆర్థిక సంవత్సరంలో 10కోట్ల 17లక్షల 52వేల 111 రూపాయల ఆదాయం రాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 11కోట్ల 97లక్షల 48వేల 161 రూపాయలు వచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో మున్సిపాలిటీకి అన్ని రకాల పన్నుల కింద 21 కోట్ల 25 లక్షల 82 వేల 833 రూపాయల ఆదాయం రాగా, ఈ ఏడాది 23కోట్ల 20లక్షల 10వేల 138రూపాయల ఆదాయం వచ్చింది. ఆలస్య చెల్లింపుల రుసుం కింద ఈ ఏడాది అదనంగా 40లక్షల 19వేల 818 రూపాయల ఆదాయం వచ్చింది. జీఎస్‌డబ్ల్యూఎస్ కింద 3కోట్ల 50లక్షల 51వేల 350 రూపాయలు వచ్చింది. ఖాళీ జాగాల పన్ను 8లక్షల 78 వేల 175 రూపాయలు ఆదాయం లభించింది. కుళాయి పన్ను అదనంగా 7లక్షల 60వేల 964 రూపాయలు వచ్చింది. మీటర్లు ఉన్న కుళాయిల ద్వారా 89 లక్షల 29 వేల 362 రూపాయలు అదనపు ఆదాయం వచ్చింది. పట్టణ ప్రణాళికా విభాగం, పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్ ఇతర ఆదాయాల ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో 26 కోట్ల 93 లక్షల 96 వేల 848 రూపాయల ఆదాయం రాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 30 కోట్ల 36లక్షల 60 వేల 36 రూపాయల ఆదాయం వచ్చింది. అదనంగా అన్ని ఖాతాల ద్వారా మూడు కోట్ల 42లక్షల 63వేల 188 రూపాయల ఆదాయం వచ్చింది.

> **సమష్టి కృషి వల్లే**
>
> సిబ్బంది, అధికారుల సమన్వయ సహకారంతో పన్నుల వసూళ్లలో జిల్లాలో తొలి స్థానంలో, రాష్ట్రంలో మూడో స్థానంలో నిలవగలిగాం. పన్నులు కట్టి సహకరించిన పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు.
>
> – ఎం.ఏసుబాబు, కమిషనర్, తాడేపల్లిగూడెం

బలసులమ్మకు ప్రత్యేక పూజలు



బలుసులమ్మ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారికి ఆలయ నిర్వాహకులు శ్రీరంగం అంజి ఆధ్వర్యంలో శుక్రవారం విశేష పూజలు జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించారు. అన్న ప్రసాదాలు భక్తులకు అందజేశారు. అలాగే స్థానిక శంకరమఠంలో శుక్రవారం ఉమాచంద్రమౌళీశ్వర స్వామి వారికి, స్పటిక లింగానికి, శ్రీ సర్వమంగళ అమ్మవారికి దేవస్థానంలో విశేష అర్చనలు, యతీశ్వర మంత్రాభిషేకాలు జరిగాయి. ఆదిశంకరాచార్య స్వామికి పూజలు నిర్వహించారు. అమ్మవారికి విశేష కుంకుమార్చలు జరిగాయి. భక్తులు పాల్గొన్నారు.

మండపాకలో కిశోర వికాసం సమ్మర్ క్యాంపు



మండపాకలో కిశోర వికాసం సమ్మర్ క్యాంపులో ఐసీడీఎస్ పీవో ప్రమోదిని, డాక్టర్ బంగారు రవిరాజు



ప్రత్తిపాడు ఎస్సీపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో తణుకు మండలం మండపాక గ్రామంలో శుక్రవారం కిశోర వికాసం సమ్మర్ క్యాంప్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి ఎంవీఎస్ఎస్ ప్రమోదిని మాట్లాడుతూ కిశోర బాలికలంతా సమాజంలో తమకు పొందుపరిచి ఉన్న హక్కులను తెలుసుకోవాలని అన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాలకు పెద్దలు ప్రోత్సహించినా లొంగకుండా తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని సూచించారు. విద్యాభ్యాసంపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను చే రుకోవాలని కోరారు. సమ్మర్ క్యాంపు ఈనెల 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రేలంగి పీహెచ్‌సీ డాక్టర్ బంగారు రవిరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీవీకేఎస్ కృష్ణకుమారి, ఎంపీటీసీ సభ్యులు శ్రీను, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

బాలికలకు చట్టాలపై అవగాహన

పెంటపాడు: యుక్తవయస్సు బాలికల ఆరోగ్యంపై ఐసీడీఎస్ ప్రత్యేక శ్రద్ధ అవసరమని ఐసీడీఎస్ సీడీపీవో టీఎల్ సరస్వతి పేర్కొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర్ వికాశం సమ్మర్ క్యాంపు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ప్రత్తిపాడు ఎస్సీకాలనీలో యుక్తవయస్సు బాలికలతో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు యుక్తవయస్సు బాలికలలో ఆరోగ్యం, పోషణ, ఎన్‌పవర్‌మెంట్ తదతర విషయాలలో అవగాహన కోసం ఈనెల 2 నుంచి జూన్ 10 వరకు పలు ప్రాంతాలలో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి సెంటర్‌లోని నిర్వాహకులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ దుర్గా భవాని, ఏఎన్ఎం అన్నపూర్ణ, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామంలోని కిశోర్ బాలికలు సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు యుక్త వయస్సులోనే వివాహాలు చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్: బాలికలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి అన్నారు. కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పెదతాడేపల్లి సచివాలయం వద్ద యుక్త వయస్సు కలిగిన బాలికలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్తేరు రాణి మాట్లాడుతూ బాలికలకు చిన్నతనం నుంచి పోషకాలతో కూడిన ఆహారం అందజేయాలన్నారు. తద్వారా యుక్త వయస్సులో బలంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న చిక్కీలు, పాలు వంటి వాటిని క్రమం తప్పకుండా పొందాలన్నారు. పంచాయతీ కార్యదర్శి టి.రవిచంద్ర, ఏఎన్ఎం జి.పద్మ, అంగన్‌వాడీ టీచర్లు బి.వెంకటలక్ష్మి, కే.రామలక్ష్మి, టి.సుధారాణి, కే.సునీత, జీఎంఎస్‌కే అలేఖ్య, వరలక్ష్మి పాల్గొన్నారు. అలాగే, కొత్తూరు గ్రామంలోనూ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి ఆధ్వర్యంలో కిశోర వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మే 2 నుంచి జూన్ 10వ తేది వరకు ప్రతి మంగళ, శుక్రవారాలు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. సర్పంచ్ కూడవల్లి హనుమంతరావు, జీఎంఎస్‌కే సీహెచ్. ప్రసన్న కుమారి, ఏఎన్ఎం కే.విజయశాంతి, ఆశా కార్యకర్త పి.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎ.ముత్యాలు, కే.సునీత పాల్గొన్నారు.

వెంకట్రామన్నగూడెంలో కిశోర వికాసం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో కిశోర వికాసంపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పసుమర్తి రామ్‌లక్ష్మణ్ మాట్లాడారు. విద్యాక మిటి చైర్మన్ మరిడి మునేశ్వరరావు, గోతం పోసిబాబు,మానికల లక్ష్మణరావు,మహిళా పోలీస్ షేక్ జరీనా, ఏఎన్ఎం భాగ్యం, అంగన్‌వాడీ సిబ్బంది దీన స్వరూపారాణి, టి.గంగారత్నం తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో మంచి ఆరోగ్యం



తణుకులో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో మాట్లాడుతున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తణుకు అర్బన్: పరిసరాల పరిశుభ్రతే మంచి ఆరోగ్యానికి మూల కారకమని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఏకేటీపీ స్కూలు, మున్సిపల్ ప్రాథమిక పాఠశాల నెం.3 ప్రాంతాల్లో కిశోర బాలికలకు ఫ్రైడే డ్రైడేపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి రోజు కొద్ది పాటి సమయాన్ని కేటాయించి ఇంటి ఆవరణలో నీరు చేరడానికి అవకాశం ఉన్న నిరుపయోగ సామగ్రిని గుర్తించి తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మునిసిపల్ చెత్త సేకరణ సిబ్బంది ఇంటి ముందుకు వచ్చినపుడు చెత్త, వ్యర్థాలు వారికి అందజేయాలని పిలుపునిచ్చారు. దోమ కాటు నుంచి రక్షణ నిమిత్తం స్లీవ్ దుస్తులు ధరించాలని, దోమతెరలు వాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రెటరీలు పి.మాధవి, ఎం.మంజూషా, వై.మౌనిక, వి.రాజకుమారి, ఉమన్ ప్రొటెక్షన్ సెక్రెటరీలు స్వప్న, వై.సునీత, భార్గవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామని, ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దుదామని, ఆరోగ్య నియమాలు పాటించుట ద్వారా ఆరోగ్య భద్రత కల్పిద్దామని సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం బేబి సెంటర్ జంక్షన్ పరిధిలో 10, 12 వార్డులలో శుక్రవారం హెల్త్ అధికారులు, సిబ్బందిచే డ్రై డే కార్యక్రమాలు, ఆరోగ్య కార్యక్రమాల అమలు, ఇంటింటి సర్వేలు జరిగాయి. కీటకజనిత వ్యాధులపై ఇంటింటికి తిరిగి అవగాహన, ర్యాలీలు నిర్వహించారు. వై.వీ.లక్ష్మణరావు మాట్లాడుతూ నీటి నిల్వలు దోమలకు ఆవాసాలు అన్నారు. ప్రజలు ఆరోగ్య నియమాలు తప్పక పాటించాలని కోరారు. దోమలను అరికట్టేందుకు శానిటరీ విభాగానికి పూర్తిగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు మేరీ, మంగతయారు, ఆరోగ్య సహాయకులు కాంతారావు, అంగన్‌వాడీ ఎస్తేరు, ఆశా సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సభ్యుల సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ తాడేపల్లిగూడెం బ్రాంచ్ సభ్యుల సర్వసభ్య సమావేశం శుక్రవారం పట్టణంలో నిర్వహించారు. సర్వసభ్య సమావేశంలో సొసైటీ చైర్మన్ రంగరాజు, మేనేజింగ్ డైరక్టర్ నరేంద్ర కుమార్‌లు మాట్లాడుతూ సభ్యులకు సంస్థ ప్రగతిని వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో బ్రాంచ్ సుమారు 15 శాతం వృద్ధి సాధించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సభ్యులు ఎం.సత్యనారాయణ, గరికపాటి బాపయ్య శర్మ, కృష్ణ కుమారి, బ్రాంచ్ మేనేజర్ వినోద్ వర్మ, సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



తణుకులో న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.సత్యవతి

తణుకు అర్బన్: కార్మికులంతా తమకు అందుబాటులో ఉన్న కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. లేబర్ డే వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం తణుకులోని రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థలో విధుల్లో ఉన్న కార్మికులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయ సేవల సంస్థల ద్వారా అర్హులకు ఉచిత న్యాయసేవలు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. కుటుంబ, ఆస్తి తగదాల్లో ఉచితంగా న్యాయసహాయం మండల న్యాయసేవల కమిటీ ద్వారా పొందవచ్చని, న్యాయసేవల సంస్థ టోల్ ఫ్రీ నంబరు 15100 ద్వారా సహాయ సహకారాలు పొందవచ్చని స్పష్టం చేశారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్‌లు లక్ష్మణ్‌కుమార్, కిరణ్ కుమార్, సీనియర్ న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, కామన మునిస్వామి పారా లీగల్ వలంటీర్‌లు కొనపల్లి అరుణ్ బాబు, కాకర్ల నరసన్న, ఎం.శ్రీదేవి, కె.నాగమల్లీశ్వరి , సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా మేనేజరు అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పరిమెళ్ల గ్రామంలో నిరసన చేస్తున్న ఉపాధి కూలీలు

పెంటపాడు: ఉపాధి హామీ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. శుక్రవారం పెంటపాడు మండలంలో విప్పర్రు, పరిమెళ్ల, యానాలపల్లి గ్రామాలలో ఉపాధి హామీ సిబ్బందిని కలిసి ధరల అదుపుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా ఉంటూ ఆకాశాన్నంటుతున్న ధరలను అదుపులోకి తెచ్చి తక్షణం శ్రామికులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

కొవ్వూరి గోపాలకృష్ణ రెడ్డి సేవలు మరువలేనివి

తాడేపల్లిగూడెం (టీఓసీ):స్థానిక 11వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో శుక్రవారం సమాజ సేవకులు, న్యాయవాది, మాజీ ఎంపీటీసీ కొవ్వూరి గోపాలకృష్ణ రెడ్డి సంస్మరణ సభ జరిగింది. అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా, ఇతర జడ్జిలు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శిరిగినీడి విజయకృష్ణ, జనరల్ సెక్రటరీ పెదగాడి భూపాల్, నాయవాదులు కె.సూర్యచంద్రరావు, ఆర్ఎస్‌వీ సోమేశ్వరరావు, అడిషనల్ పీపీ శివరామకృష్ణ, కె.అప్పిరెడ్డి తదితర న్యాయవాదులు మాట్లాడారు. గోపాలకృష్ణరెడ్డికి శ్రద్ధాంజలి ఘటించారు.

ఉత్సాహంగా ఆటాడుకుందాం

- జిల్లాలో 50 వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం
- విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతుల ప్రదానం



తణుకు ఆర్చరీ శిక్షణా శిబిరంలో బాలలు

భీమవరం: వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని పూర్తిగా వృథా చేయకుండా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 50 కేంద్రాల్లో గురువారం ప్రారంభమైన క్రీడా శిక్షణ ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహించి, శిక్షణ పూర్తి చేసిన క్రీడాకారులకు పోటీలు నిర్వహించి, విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తారు. జిల్లాలో ఏర్పాటు చేసిన క్రీడా శిక్షణ శిబిరాల వివరాలను డీఎస్‌డీఓ ఎం.రాజేష్ తెలిపారు. ఎనిమిది నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు శిక్షణ ఇచ్చే విధంగా క్రీడా శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. గురువారం నుంచి ప్రారంభమైన శిక్షణలో కొత్త వారిని కూడా చేర్చుకుంటారని, వీటిని బాలలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

క్రీడా శిబిరాలు నిర్వహించే ప్రాంతాలు

- ఆర్చరీ: తణుకు మాంటిస్సోరి స్కూల్
- అథ్లెటిక్స్: తణుకు ఎస్‌సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భీమవరం డీఎన్నార్ కళాశాల, తాడేపల్లిగూడెం కోడే వెంకట్రావు హైస్కూల్, శృంగవృక్షం జెడ్పీ హైస్కూల్
- బాస్కెట్‌బాల్: మార్టేరు ఎస్‌వీజీజెడ్పీ స్కూల్, తాడేపల్లిగూడెం కోడే వెంకట్రావు హైస్కూల్, తణుకు జెడ్పీహెచ్ఎస్ బాయిస్ స్కూల్, భీమవరం డీఎన్నార్ కళాశాల, పెనుగొండ ఎస్‌వీకేపీ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల, తణుకు మాంటిస్సోరీ స్కూల్, పెంటపాడు సరస్వతి విద్యాలయ స్కూల్
- బ్యాడ్మింటన్: పెనుగొండ ఎస్‌వీకేపీ కేఎస్‌రాజు కళాశాల
- బాక్సింగ్: పెనుమంట్ర ఎస్ఆర్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, పెనుగొండ ఎస్‌వీకేపీ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల, నవుడూరు కేఎస్ఎన్ఆర్ డిగ్రీ కళాశాల, అత్తిలి జెడ్పీ బాయిస్ హైస్కూల్, తణుకు ఎస్‌సీఐఎంజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అత్తిలి ప్రభుత్వ హైస్కూల్
- క్రికెట్: పెంటపాడు సరస్వతి విద్యాలయ స్కూల్, భీమవరం డీఎన్నార్ కళాశాల
- పుట్‌బాల్: పెంటపాడు సరస్వతి విద్యాలయ స్కూల్, భీమవరం లూథరన్ హైస్కూల్, భీమవరం డీఎన్నార్ కళాశాల
- జిమ్నాస్టిక్: భీమవరం డీఎన్నార్ కళాశాల
- హాకీ: భీమవరం సెంట్‌మేరీస్ హైస్కూల్, శృంగవృక్షం జెడ్పీ హెచ్ఎస్ హైస్కూల్.
- కబడ్డీ: తాడేపల్లిగూడెం టీఎస్ఎం జెడ్పీ హెచ్ స్కూల్, తణుకు ఎస్‌సీఐఎం ఆర్ట్స్ డిగ్రీ కళాశాల, తణుకు మాంటిస్సోరీ స్కూల్, పెనుగొండ ఎస్‌వీకేసీ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల
- కరాటే: మార్టేరు ఎస్‌వీజీజెడ్పీ స్కూల్
- స్కిప్పింగ్: తణుకు మున్సిపల్ పార్క్, తణుకు మాంటిస్సోరీ స్కూల్,
- టేబుల్ టెన్నిస్: భీమవరం ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం హైస్కూల్, పెనుగొండ ఎస్‌వీకేపీ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల
- తైక్వాండో: తాడేపల్లిగూడెం ద్రోణాచార్య స్పోర్ట్స్ క్లబ్
- టెన్నిస్: భీమవరం డీఎన్ఆర్ కళాశాల
- త్రోబాల్: సిద్దాపురం జెడ్పీహెచ్ స్కూల్
- వాలీబాల్: మండపాక ప్రైమరీ స్కూల్ నంబర్ 3, గుట్లపాడు జెడ్పీహెచ్ స్కూల్, ఇలింద్రపర్రు జెడ్పీహెచ్ స్కూల్, తణుకు ఎస్‌సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భీమవరం డీఎన్నార్ కళాశాల, సిద్దాపురం జెడ్పీహెచ్ స్కూల్, తణుకు జెడ్పీహెచ్ స్కూల్, అత్తిలి ప్రభుత్వ హైస్కూల్, పెనుగొండ ఎస్‌వీకేపీ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల
- యోగా: గుట్లపాడు జెడ్పీహెచ్ స్కూల్, భీమవరం ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం హైస్కూల్.



కబడ్డీ శిక్షణలో బాలికలు



త్రోబాల్ శిక్షణలో బాలురు